# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

3 | నిజామాబాద్ గురువారం 9 మే 2024 | ADILABAD NIRMAL




# గులాబీ జోష్

- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- గడప గడపకూ కారు.. రంగంలోకి అగ్రనేతలు
- నేడు నిర్మల్ జిల్లాలో కేటీఆర్ పర్యటన
- భైంసా, నిర్మల్ పట్టణాల్లో రోడ్ షోలు

నిర్మల్, మే 8(నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ తన ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నది. పక్షం రోజులుగా ప్రచారాన్ని వేగవంతం చేస్తూ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. కొంత మంది ఇతర పార్టీల్లో చేరుతున్నప్పటికీ కార్యకర్తలు మాత్రం మనోధైర్యాన్ని కోల్పోకుండా బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తున్నారు. కోట్లాది రూపాయలను ఖర్చు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందంటూ ప్రచారం చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది సీనియర్ నాయకులు పార్టీకి వెన్నుపోటు పొడిచి, అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని, అలాంటి వారు ప్రచారానికి వస్తే నిలదీయాలంటూ వివరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నదని, దీనిని ప్రజలందరూ గుర్తించాలంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో జడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి, నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు రాము, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు ప్రచార బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్తలు పడకంటి రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్‌లు మండలాలవారీగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నీతానై ప్రచార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా లంబాడాలను కలుస్తూ బీఆర్ఎస్ మద్దతునిచ్చేలా ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు దీటైన సమాధానమిస్తూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారానికి జనం జేజేలు కొడుతున్నారు. బీఆర్ఎస్‌కు అడుగడుగునా వస్తున్న జనాదరణను చూసి ఇతర పార్టీల నాయకులు అయోమయానికి గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రచార వేడిని ముమ్మరం చేయడంతో శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తున్నది.

### నేడు జిల్లాలో పర్యటించనున్న కేటీఆర్

బీఆర్ఎస్ తన ప్రచారాన్ని ముమ్మరం చేసే వ్యూహంలో భాగంగా అగ్రనేతలను రంగంలోకి దింపుతున్నది. ఈ నెల 9(గురువారం)న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం హెలికాప్టర్ ద్వారా భైంసాకు చేరుకుంటారు. అక్కడ రోడ్ షోలో పాల్గొని యూనియన్ బ్యాంక్ కూడలి వద్ద జరిగే రోడ్ షోలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి నిర్మల్ చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటలకు మంచిర్యాల చౌరస్తాలో జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. అయితే కేటీఆర్ రోడ్ షోలకు జనాన్ని పెద్ద ఎత్తున సమీకరించేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. మూడు రోజుల క్రితం నిర్మల్‌లో ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో జరిగిన బూత్ లెవల్ పార్టీ కార్యకర్తల సమావేశానికి వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావడం ఆ పార్టీకి ఊపునిచ్చిందంటున్నారు.



నిర్మల్‌లోని కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



దస్తూరాబాద్ : ప్రచారం నిర్వహిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



భైంసా పట్టణంలో బీఆర్ఎస్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్

### కేటీఆర్ రాకతో మారనున్న ప్రచారపర్వం

బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ దీటైన ప్రసంగాలకు జనం ఆకర్షితులయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్, కేటీఆర్ ప్రసంగాలకు జనాదరణ లభిస్తున్నట్లుగానే నిర్మల్ జిల్లాలో కూడా అదే రకమైన స్పందన లభిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతోపాటు బీఆర్ఎస్ వర్గాలు సోషల్ మీడియాను ప్రధాన ప్రచార వేదికగా మార్చుకుంటున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రచారంలో వెనుకబడి ఉండడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అవకాశంగా మలుచుకుంటున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఆర్ఎస్ నేతలంతా ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన సంక్షేమ, లభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతున్నారు. ఆశించిన రీతిలో ఓటర్లు బీఆర్ఎస్ నేతలను ఆదరిస్తుండడం ఆ పార్టీకి కొత్త ఉత్సాహాన్నిస్తున్నది.

### హెలిప్యాడ్ స్థలం పరిశీలన

భైంసా, మే 8 : భైంసాలో గురువారం నిర్వహించనున్న రోడ్ షోకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ధనంజయ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ముథోల్ సమన్వయ కమిటీ సభ్యురాలు రమాదేవి, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రేవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. సాయంత్రం ఐదు గంటలకు రోడ్ షో ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పాత పోస్టాఫీసు సమీపంలో కేటీఆర్ ప్రసంగిస్తారన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సక్కును గెలిపించాలి..



ధనోరా(బీ)లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



ఇంద్రవెల్లి, మే 8 : ఈ నెల 13వ తేదీన నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ధనోరా(బీ), పిప్రి గ్రామాల్లో ఆయన గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యనాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలు మోసపూరిత మాటలకు ప్రజలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జిలానీ బేగ్, అమ్జద్, షేక్ సుఫియాన్, జాదవ్ జమునాయక్, ఏర్మ జాకేశ్వర్, విజయ్‌కుమార్, శివాజీ, సోయం రాందాస్, భరత్, శ్యాం కేంద్రె, మెస్రం ఆనంద్‌రావ్, సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి



బాసరలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాసర, మే 8 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామారావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కోర్వ శ్యాం, లాబ్ది గ్రామ నాయకులు రాజు పటేల్, బాపూరావు, ధరసింగ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



కరంజి(టి)లో ప్రచారం చేస్తున్న నాయకులు

భీంపూర్, మే 8 : అంతర్గాంలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, రాంపూర్‌లో ఎంపీపీ కుడిమెత రత్నప్రభ, పిప్పల్‌కోటిలో వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ధనోరాలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, కరంజి(టి)లో నాయకులు జి.నరేందర్, ఎం.కల్యాప్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. రైతులు, యువత, కులవృత్తుల కుటుంబాలలో బీఆర్ఎస్ హయాంలోని ప్రగతి వివరించారు. కారు గుర్తుకే ఓటేసి సక్కును ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు జహూర్ అహ్మద్, మల్లెల స్వామి, మార్సెట్టి అనిల్, ముకుంద సంతోష్, సంజీవ్‌రెడ్డి, అఫ్రోజ్, బొంత నితిన్, లింబాజీ, రవీందర్, జహూర్ అహ్మద్ పాల్గొన్నారు.

## మహిళలను మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్



కరపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్, మే 8 : తెలంగాణలోని మహిళలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని బీఆర్ఎస్వీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, బీఆర్ఎస్ నాయకుడు రామగిరి వాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీ, సేవదాస్‌నగర్, శాంతినగర్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు రూ.2,500, గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. అటువంటి పార్టీని నమ్మి మరోసారి ఓటువేస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాడిగె రాజ్‌కుమార్, సౌకత్, లతీఫ్, దినేశ్, గౌష్, జావీద్, రాములు, సుమన్, చంద్రయ్య, అతిక్‌లు పాల్గొన్నారు.

## జోరుగా ప్రచారం



నేరడిగొండలో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

నేరడిగొండ, మే 8 : మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, మాజీ సర్పంచ్ విశాల్‌కుమార్, నాయకులు జాదవ్ గణేశ్, మధన్‌సింగ్, మద్దెల నారాయణ, రాథోడ్ సురేందర్, సుజిల్‌కుమార్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులపై ఆగ్రహం

### పనిచేసే చోట కనీస వసతులు కల్పించడం లేదని మండిపాటు



కాంగ్రెస్ నాయకుడు, ఎంపీపీ సింగరి కిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

దస్తురాబాద్, మే 8 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను ఎంపీపీ సింగరి కిషన్, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో టెంట్, మంచి సౌకర్యం, నీడ కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. మజ్జిగ ప్యాకెట్లను కొంత మందికే ఇస్తున్నారని, ఇచ్చినోళ్లకే రెండు ప్యాకెట్ల చొప్పున ఇచ్చారని కోపంతో ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

# సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ఖానాపూర్ టౌన్, మే 8 : హిందువుల ఆరాధ్యదైవం సీతారాములపై సీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. బుధవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కాశవేణి ప్రణయ్ మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన తుక్కుగూడలో నిర్వహించిన రోడ్ షోలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు కావవి, స్థానికంగానే రేషన్ బియ్యాన్నికి పసుపు పూసి ఇంటింటికీ పంచారని రేవంత్‌రరెడ్డి అవహేలన చేశారని మండిపడ్డారు. అయోధ్యలో కొలువుదీరిన బాలరామునిపై, అయోధ్య అక్షింతలపై మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రాజాకార్ల పాలన కొనసాగిస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గాంధీభవన్ గడీలు బద్ధలు కొడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# బీజేపీకి ఓటేస్తే మన హక్కులు కోల్పోతాం..

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నిర్మల్ చైన్‌గేట్, మే 8 : ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నిర్మల్ పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యురాలు ఆత్రం సుగుణను గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలు తీరుతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

# పోలింగ్ ప్రక్రియను పరిశీలించాలి..

### ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

ఎదులాపురం, మే 8 : పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా అన్నారు. మైక్రో అబ్జర్వర్స్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు, నిశితంగా పరిశీలించడానికి మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాలదారులు, మాక్ పోల్ అనంతరం చేపట్టే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా? లేదా? అని పరిశీలన చేయాలన్నారు. ఈ అంశాలపై జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. సాంకేతిక లోపాల వల్ల ఈవీఎంలు పనిచేయక పోతే వాటి స్థానంలో వేరే ఈవీఎంలను ఎలా అమరుస్తున్నారో పరిశీలన చేయాలన్నారు. పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని, మైక్రో అబ్జర్వర్స్ శిక్షణలో అన్ని అంశాలపై అవగాహన కల్పించుకుని ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. మాక్ పోల్ ఉదయం 5.30గంటలకు ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి రాజర్షి షా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన 190 మంది మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రెయినర్ లక్ష్మణ్ మైక్రో అబ్జర్వర్స్‌కు అవగాహన కల్పించారు.

### పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు ఈసీ ఈనెల 10 తేదీ వరకు గడువు పెంచిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు గడువు ఉండగా 10వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

# వడదెబ్బతో వృద్ధుడి మృతి

నేరడిగొండ, మే 8 : నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కందుకూరి రాములు(62) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. నేరడిగొండ మండలంలో తనకు వ్యవసాయ భూమి ఉంది. రెగ్యూలర్‌గా పొలం వద్దకు వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కూడా చించోలి నుంచి ఆటోలో తన వ్యవసాయ భూమిని చూసుకోవడానికి వడూర్ గ్రామానికి వచ్చాడు. అయితే గ్రామంలోని బెల్టషాప్ ఆవరణలోని రేకుల షెడ్డులో మృతి చెంది ఉన్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు తన బంధువులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి శవాన్ని చించోలి గ్రామానికి తీసుకెళ్లారు. వడదెబ్బతో మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. మృతి చెందిన సమీపంలో బెల్టుషాప్, తెల్లకల్లు దుకాణాలు ఉండడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.